# గ్లాకోమా రహిత ప్రపంచ నిర్మాణమే మన లక్ష్యం కావాలి..!

## (06 - 12 మార్చి "ప్రపంచ గ్లాకోమా వారం" సందర్భంగా)

ప్రకృతి అందాల విందు ఆరగించడానికి రెండు కళ్లు చాలవు. కంటి చూపు ఉన్నపుడే సప్తవర్ణ సింగిడి రంగుల ప్రపంచాన్ని దర్శించవచ్చు. భగవంతుడి సృష్టిని కళ్లారా చూడగలగడమే ఓ అపూర్వమైన ఆస్తి. దృష్టి దోషమున్న అభాగ్యుల జీవితాల్లో కారు చీకట్లే రాజ్యమేలుతాయి. కంటి చూపును పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తలను విధిగా తీసుకోవాలి. 'చికిత్స కన్న నివారణే మిన్న' అని భావించాలి. తరుచుగా (కనీసం 2 ఏండ్లకు ఒకసారి) నేత్ర పరీక్షలు చేయించుకుంటూ, ప్రమాదకర అంధత్వ కారణ గ్లాకోమా దుస్థితి నుంచి దూరంగా ఉండే ప్రయత్నాలు చేయాలి. కంటి చూపు క్రమంగా మందగించడంతో ఏర్పడే దృష్టి లోపాన్ని 'గ్లాకోమా' వ్యాధి గుర్తించాలి. ప్రపంచవ్యాప్తంగా అంధత్వానికి కారణమైన 2వ అతి పెద్ద వ్యాధి అయిన గ్లాకోమా అనే నేత్ర సంబంధ లోపాన్ని నివారించడానికి తరుచుగా కంటి పరీక్షలు చేసుకోవడం, తొలి దశలోనే గుర్తించడం, వైద్యంతో నయం చేసుకోవడం జరగాలి. గ్లాకోమా ముదిరితే కంటి చూపు తగ్గిపోతూ, వైద్యులు కూడా నయం చేయలేని నిస్సహాయ దుస్థితికి చేరి, చివరకు కోలుకోలేని అంధత్వం ఆవహిస్తుంది.

'గ్లాకోమా లేని ప్రపంచ నిర్మాణానికి ఐక్యమవుదాం' నినాదం:

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2.3 శాతం ప్రజలు గ్లాకోమా సమస్యతో సతమతం అవుతున్నారని, 4.5 మిలియన్ల గ్లాకోమా రోగులు దృష్టి కోల్పోయారని, 2020 నాటికే వీరి సంఖ్య 11.2 మిలియన్లకు చేరి ఉండవచ్చని అంచనా వేశారు. ఇండియాలో కనీసం 12 మిలియన్ల ప్రజలు గ్లాకోమా సమస్యతో బాధ పడుతున్నారని, వీరిలో 1.2 మిలియన్లు అంధత్వం పొందారని తేలింది. తెలంగాణలో 5 లక్షల గ్లాకోమా బాధితులు ఉన్నారని అంచనా. సాధారణంగా 90 శాతం కేసుల్లో గ్లాకోమా సమస్య ఉందని కూడా తెలియదు. వయసు పెరిగిన కొద్దీ గ్లాకోమా వ్యాధి బారిన పడే అవకాశం పెరుగుతుంది. ఇలాంటి ప్రమాదకర దృష్టి దోష సమస్య తీవ్రతను గుర్తించిన 'ప్రపంచ గ్లాకోమా అసోసియేషన్' నిరంతర కృషితో గ్లాకోమా వ్యాధి పట్ల సామాన్య ప్రజలకు అవగాహన కల్పించే క్రమంలో ప్రతి ఏటా 06 మార్చి నుంచి 12 మార్చి (కొన్ని దేశాల్లో 8 - 14 లేదా 07-13 మార్చి) వరకు 'ప్రపంచ గ్లాకోమా వారం (వరల్డ్ గ్లాకోమా వీక్)' పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. 'యునైటింగ్ ఫర్ గ్లాకోమా-ఫ్రీ వరల్డ్' అనబడే అంశం పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

వయసు పైబడి జనులు జాగ్రత్త:

గత దశాబ్ద కాలంగా గ్లాకోమా సంబంధ దృష్టి లోపాన్ని అనుభవిస్తున్న ప్రజల్లో, ముఖ్యంగా వృద్ధులలో, 30 శాతం పెరిగిందని తేలింది. కంటి చూపుకు ప్రధానమైన 'దృష్టి నాడి (ఆప్టిక్ నర్వ్)' దెబ్బతినడం కారణంగా బయట పడే దృష్టి లోపాన్ని గ్లాకోమాగా పిలుస్తారు. నేత్రాలు సక్రమంగా విధులు నిర్వహించడానికి, నేత్ర నిర్దిష్ట ఆకారం నిలవటానికి కనీస నేత్ర పీడనం (11 - 21 యంయం మెర్క్యురీ) అవసరం అవుతుంది. దృష్టి నాడి బలహీన పడడం లేదా దెబ్బతినడంతో నేత్ర పీడనం అతిగా పెరిగినపుడు దృష్టి నాడి దెబ్బతిని కంటి చూపు క్రమంగా తగ్గిపోతూ, సకాలంలో గుర్తించని యెడల శాశ్వత అంధత్వం రావచ్చు. నేత్ర వ్యవస్థలో నిరంతరం నియమిత పరిమాణంలో జల ద్రవాలు ఊరుతూ, కొంత ద్రవం కంటిలోంచి బయటకు వస్తుంది. ఈ జల ద్రవం అవసరం కన్న తక్కువ ఉత్పత్తి అయినపుడు కంటి వ్యాధులకు దారి తీస్తుంది. పుట్టుకతో, నవజాత శిశువుల్లో, చిన్నతనంలోనూ వచ్చే అవకాశం ఉన్న గ్లాకోమా వ్యాధి 40 ఏండ్లు పైబడిన వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. గ్లాకోమా వ్యాధికి తీవ్రమైన లక్షణాలు ఏవీ కనిపించని కారణంగా కంటి నొప్పి లాంటి లక్షణాలు అనుభవంలోకి వచ్చినపుడు నేత్ర వైద్యున్ని సంప్రదించాలి. తరుచుగా కంటి పరీక్షలు చేయించుకోవడం అనే సూత్రమే గ్లాకోమాను ఎదుర్కొనే ఏకైక మార్గమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గ్లాకోమా వ్యాధిలో దీర్ఘకాలిక (క్రోనిక్), తీవ్రమైన (అక్యూట్) గ్లాకోమా రకాలు ఉన్నాయి. వయస్సు, మానవ జాతి, బిపి, షుగర్, ఇతర వ్యాధులు, కుటుంబ నేపథ్యం, హ్రస్వ దృష్టి లాంటి అంశాలపై దీర్ఘకాలిక గ్లాకోమా ఆధారపడి ఉంటుంది. నేత్ర పీడనం అతిగా పెరిగినపుడు తీవ్రమైన (అక్యూట్) గ్లాకోమా లక్షణాలకు దారి తీస్తూ, అంధత్వం రావచ్చు.

నిశ్శబ్ద అంధత్వ వ్యాధి - గ్లాకోమా:

గ్లాకోమా సమస్య వచ్చిన తరువాత తిరిగి నయం చేయడం అసాధ్యం కావడంతో ఈ వ్యాధిని 'నిశ్శబ్ద అంధత్వ వ్యాధి' లేదా 'చూపును దోచుకునే దొంగ వ్యాధి'గా వర్ణిస్తారు. తొలి దశలో గ్లాకోమాను గుర్తిస్తే నయం చేసి దృష్టిని కాపాడవచ్చు. వ్యాధి ముదురుతే నయం చేయడం వీలుకాదని తెలుసుకుందాం.

తొలి దశలో గుర్తించబడిన రోగులకు కంటి చుక్కలు, ఔషధాలు, శస్త్రచికిత్స విధానంతో నయం చేసే ప్రయత్నాలు చేస్తారు. గ్లాకోమా ప్రమాదం 40 ఏండ్లు దాటిన ప్రజల్లో సాధారణంగా కనిపిస్తాయని తెలుసుకొని, ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి విధిగా నేత్ర పరీక్షలు చేసుకొని గ్లాకోమాకు దూరంగా, వెలుగులకు దగ్గరగా ఉండటానికి ప్రయత్నం చేద్దాం. ఎలాంటి వ్యాధి లక్షణాలు లేకపోవడంతో గ్లాకోమా పట్ల ప్రజలకు జాగరూకత అత్యవసరం.

ప్రపంచ గ్లాకోమా వారం సందర్భంగా సమాజంలో ఉచిత నేత్ర పరీక్షల నిర్వహణ, గ్లాకోమా రోగులకు అవసర చికిత్స, అవగాహన వేదికలు, ఉపన్యాసాలు, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం, విద్యాలయాలలో వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడం జరగాలి. అదృశ్య శత్రువు గ్లాకోమా, ముందు చూపుతో తరుచుగా పరీక్షలు చేయించుకొని గ్లాకోమాను అంతం చేద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# కేసీఆర్‌తో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భేటీ



హైదరాబాద్, మార్చి5:మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో బీఎస్పీ స్టేట్ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భేటీ అయ్యారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్ళిన ఆర్ఎస్పీ, మరికొద్దిమంది పార్టీ నేతలు సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జరిగిన ఈ భేటీకి రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది.

మర్యాదపూర్వకంగానే ఆర్ఎస్పీ వచ్చి కలిశారంటూ బీఆర్ఎస్ వర్గాలు వివరణ ఇచ్చాయి. మరోవైపు ట్విట్టర్ (ఎక్స్) ద్వారా ఆర్ఎస్పీ కూడా సంజాయిషీ ఇచ్చుకున్నారు. ఈ రోజు ఉదయం "నా రాజకీయ ప్రస్థానం పై వస్తున్న వదంతులను నమ్మకండి. చివరి శ్వాస వరకు సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం దిశవైపే నా ప్రయాణం" అంటూ క్లారిటీ ఇచ్చారు.

# వెంకట్ కుటుంబానికి కవిత పరామర్శ..



నిజామాబాద్, మార్చి 5:విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో నిన్న బోధన్ బీసీ హాస్టల్‌లో మరణించిన హర్యాల వెంకట్ కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్యే జాజల సురేందర్‌తో కలిసి పరామర్శించారు. జిల్లాలోని గాంధారి మండలం తిప్పారం తండాకు చేరుకున్న చేరుకున్న కవిత వెంకట్ సభ్యులను కలిశారు.

అనంతరం వెంకట్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. కవిత బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి, ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# శ్రీశైలమల్లికార్జునుడికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు..

శ్రీశైలం,మార్చి 5: శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నేటితో 5వరోజుకు చేరుకున్నాయి.

ఇవాళ ఉదయం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక దేవస్థానం శ్రీస్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించనుండగా, సాయంత్రం ఏపీ ప్రభుత్వం తరపున శ్రీస్వామి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

సాయంత్రం రావణవాహనంపై స్వామిఅమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు. రావణవాహనంపై ప్రత్యేక పూజలందుకోనున్నా శ్రీస్వామి అమ్మవారు.

రాత్రి క్షేత్ర వీధుల్లో ఆది దంపతుల గ్రామోత్సవం జరగనుంది. శివస్వాములతో శ్రీశైలం ఆలయం పోటెత్తింది. భక్తుల రద్దీ భారీగా పెరిగింది.

'భాషావిభూషణ' డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ
'మట్టిబండి' తృతీయ ముద్రణ
ఆవిష్కరణోత్సవం



| | | |
|---|---|---|
| వేదిక | : | పద్మావతి కళావేదిక, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం బృందావన్ గార్డెన్స్, గుంటూరు |
| సమయం | : | ది.10-03-2024, ఆదివారం ఉదయం 10 గం.లకు |
| సభాధ్యక్షులు | : | డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు ప్రముఖ నాటక రచయిత, దర్శకుడు, విమర్శకుడు |
| జ్యోతి ప్రజ్వలన | : | శ్రీ చిటిపోతు మస్తానయ్య ఆలయ కమిటీ అధ్యక్షులు |
| గ్రంథావిష్కరణ | : | శ్రీ గుళ్ళపల్లి సుబ్బారావు |
| ముఖ్య అతిథి | : | డాక్టర్ నాళేశ్వరం శంకరం కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యులు |
| ఆత్మీయ అతిథి | : | శ్రీ వల్లూరి శివప్రసాద్ కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యులు |
| పుస్తక సమీక్ష | : | శ్రీమతి పింగళి భాగ్యలక్ష్మి |
| సభా నిర్వహణ | : | డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు |

అందరూ ఆహ్వానితులే

ఆహ్వానించువారు
డాక్టర్ జెక్కంపూడి సీతారామారావు
అధ్యక్షులు, ఎన్.జి. రంగ ఫౌండేషన్ - గుంటూరు

# స్వేచ్ఛగా ఎన్నికల నిర్వహణే నా మొదటి ప్రాధాన్యత - ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్

తిరుపతి, మార్చి 5 : జిల్లాలో స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, అత్యంత ఖచ్చితత్వంతో సమగ్రంగా ప్రణాళికలను రూపొందించి ముందుకు తీసుకువెళ్తామని తిరుపతి జిల్లా కొత్త ఎస్ పి

కృష్ణ కాంత్ పటేల్ అన్నారు. 20 రోజులక్రితం నియమితులై రెండు రోజులక్రితం అనూహ్యంగా బదిలీ అయిన ఎస్ పి మల్లికా గార్గ్ స్థానంలో నియమితులైన ఆయన ఈరోజు ఉదయం జిల్లా ఎస్ పి గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కృష్ణ కాంత్ పటేల్ ఐపీఎస్ మాట్లాడుతూ? త్వరలో జరిగే ఎన్నికల సన్నాహక చర్యల్లో భాగంగా అంతర్ రాష్ట్ర, జిల్లా చెక్ పోస్టుల వద్ద తగిన పోలీసు సిబ్బందిని, కేంద్ర సాయుధ బలగాలను నియమించి సమర్థవంతంగా తనిఖీలు చేపడతామన్నారు. ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా అడ్డుకట్ట వేస్తామన్నారు. తిరుపతి అంటే ప్రముఖ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా, శాంతి భద్రతలను కాపాడుకుంటూ, అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు.

ముఖ్యంగా జిల్లాలోని శ్రీహరి కోట రాకెట్ ప్రయోగ కేంద్రం, శ్రీ సిటీ పారిశ్రామిక వాడ, వంటి కీలక ప్రాంతాల్లో తగిన గట్టి భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా తిరుపతి జిల్లా తమిళనాడు రాష్ట్రంలో ఎక్కువగా సరిహద్దును కలిగి ఉంది, కర్ణాటకకు దగ్గరగా ఉంది. కావున ఇరుగు పొరుగు జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సరిహద్దుల ద్వారా ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా తనిఖీలను ముమ్మరం చేస్తామన్నారు. రానున్న ఎన్నికల సమయంలో మీడియా వారి సహాయ సహకారం ఎంతైనా ఉంది. ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్యమైన మూల స్తంభమైన మీడియా వారు నిత్యం ప్రజాస్వామ్య పరిరక్షణకు మీ వంతు సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ దేవరాజ్ మనీష్ పాటిల్, అదనపు ఎస్పీలు వెంకట్రావు పరిపాలన, కులశేఖర్ శాంతి భద్రత, విమల కుమారి నేర విభాగం, సెబ్ రాజేంద్ర, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొని పుష్పగుచ్చాలతో నూతన ఎస్ పి పటేల్ కు ఘనంగా స్వాగతం పలికారు.

# సీఎం పర్యటనకు పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు..

శ్రీకాకుళం మార్చి 5:ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. తొలుత హెలిప్యాడ్ ప్రాంతాన్ని, పిసినికాడ సభ స్థలాన్ని పరిశీలించి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలక్టర్ రవి పటాన్ శెట్టి సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన ముందస్తు ఏర్పాట్లపై అధికారులకు తగు సూచనలు చేశారు.

సీఎం జగన్ ఈ నెల 7న పీసినికాడ హైవే ప్రక్కన 4వ విడత చేయూత నిధులను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి విడుదల చేయబోయే సభా ప్రాంతాన్ని జిల్లా కలక్టర్ రవి పటాన్ శెట్టి,విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ, ముఖ్యమంత్రి ఇంటిలిజెన్సీ సిబ్బంది పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని విజయవంతం చేయాలని కలక్టర్ కోరారు. అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వర్తించి ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పనిచేయాలన్నారు. శాఖల వారీగా కేటాయించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ప్రొటోకాల్ ప్రకారం బందోబస్తు:

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రొటోకాల్ ప్రకారం బందోబస్తు ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ కేవి మురళీకృష్ణ తెలిపారు. హెలిప్యాడ్, సభా స్థలం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రోడ్లు, భవనాలశాఖ అధికారులకు సూచించారు. బందోబస్తు ఏర్పాట్లలో ఎటువంటి లోటు పాట్లు లేకుండా పక్కాగా చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. స్పెషలిస్ట్ డాక్టర్లను, వైద్య

# సైన్స్ ఎక్స్పీరియన్స్ సెంటర్ యువతకు, సమర్థత కలిగిన స్టార్టప్ లకు అంకితం: డాక్టర్ జితేంద్ర సింగ్




న్యూఢిల్లీ, మార్చి 5:మొట్టమొదటి సారిగా ఏర్పాటుచేసిన "సైన్స్ ఎక్స్ పీరియన్స్ సెంటర్" ప్రధాని నరేంద్ర మోదీ వికసిత భారత్ దార్శనికతను సాకారం చేయడానికి దోహదపడుతుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్రహోదా), పిఎంఒ. ,పీపీ/డీవోపీటీ, అటామిక్ ఎనర్జీ, స్పేస్ సహాయమంత్రి, సి ఎస్ ఐ ఆర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. యువ మేధావులకు, సంభావ్య స్టార్టప్ లకు ఈ సెంటర్ ను అంకితం చేశారు.

సీ ఎ న్ ఐ ఆ ర్ - ఐ ఐ సీ టీ హైదరాబాద్ ఆవరణలో మొట్టమొదటి 'సైన్స్ ఎక్స్పీరియన్స్ సెంటర్', ప్రత్యేక 'బయోఫ్యూయల్ సెంటర్'కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన ప్రసంగించారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, సైన్స్ ఎక్స్ పీరియన్స్ సెంటర్ ఖచ్చితంగా మన దేశంలోని యువ మనస్సులను ప్రేరేపిస్తుందని , స్టార్టప్ ల కోసం వినూత్న ఆలోచనలతో ముందుకు రావడానికి వారిని ప్రోత్సహిస్తుందని అన్నారు. సైన్స్ లేకుండా సంస్కృతి కదలదని, సంస్కృతి లేకుండా సైన్స్ పూర్తిగా సాధించదని ఆయన అన్నారు.

సైన్స్ ఎక్స్పీరియన్స్ సెంటర్ ప్రధానంగా ప్రదర్శనలు / ఎగ్జిబిషన్ /గ్యాలరీలు మొదలైన వాటిని అభివృద్ధి చేయడం ద్వారా 'కమ్యూనికేటింగ్ సైన్స్ టు ఎంపవర్ పీపుల్' అనే నినాదంతో సమాజంలో ముఖ్యంగా విద్యార్థులలో సైన్స్ సంస్కృతిని వ్యాప్తి చేయడంలో దోహదపడుతుంది. ఇంకా ఇంటరాక్టివ్ సైన్స్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తుంది. మరోవైపు 8000 మంది ఎస్ అండ్ టీ సిబ్బందితో అతిపెద్ద సైంటిఫిక్ ఆర్ అండ్ డీ ఆర్గనైజేషన్ సీఎస్ఐఆర్ దేశ ఇన్నోవేటివ్ చోదకంగా ఉందని ఆయన అన్నారు.

సిఎస్ఐఆర్, ఎన్ సిఎస్ఎం లు తమ తమ రంగాల్లో నిరూపితమైన నైపుణ్యంతో, సైన్స్ ను ఒక సంస్కృతిగా ప్రోత్సహించడానికి పరస్పర లక్ష్యాలను కలిగి ఉండటం, రెండూ కలసి హైదరాబాద్ లోని సిఎస్ఐఆర్-ఐఐసిటి ప్రాంగణంలో సైన్స్ ఎక్స్పీరియన్స్ సెంటర్ ను ఏర్పాటు చేయడం దేశానికి ఎంతో అవసరమన్నారు.

సిఎస్ఐఆర్ తన సృజనాత్మక పరిశోధన, బలమైన ప్రాథమిక శాస్త్రం, పరిశ్రమ భాగస్వామ్యాలు, వ్యవస్థాపకత, అనువాద పరిశోధన, సామర్థ్య నిర్మాణం , విధాన రూపకల్పన ద్వారా జాతీయ అవసరాలను తీరుస్తుందని మంత్రి చెప్పారు. పైలట్ శిక్షణ కోసం స్వదేశీ రెండు సీట్ల హంసా-ఎన్జీ విమానం అభివృద్ధి, సుస్థిర విమానయానం కోసం బయో-జెట్ ఇంధనం, భారతదేశ స్వంత పాదరక్షల సైజింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయడం, భూకంప జోన్ 4 , 5 కోసం భూకంప నిరోధక నిర్మాణాలు, భారతదేశ మొట్టమొదటి ఫ్యూయల్ సెల్ ఆధారిత ఆటోమోటివ్ గత దశాబ్దంలో సిఎస్ఐఆర్ అందించిన కొన్ని ముఖ్యమైన ఆవిష్కరణలు అని ఆయన అన్నారు. ఈ రంగాలలో మార్గదర్శక కృషితో పాటు, సిఎస్ఐఆర్ నేడు మహిళలతో సహా అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకునే, అరోమా మిషన్, సముద్రపు కలుపు పెంపకం, హీంగ్ సాగు మొట్టమొదటి ప్రదర్శన, జమ్మూ కాశ్మీర్లో పర్పుల్ విప్లవం వంటి అనేక సామాజిక ప్రయోజన కార్యక్రమాలను చేపట్టిందని వివరించారు.

దేశంలో సైన్స్ సంస్కృతి అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. మహమ్మారి వంటి సంఘటనలు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరాన్ని మాత్రమే నొక్కి చెప్పాయని, అయితే సైన్స్, సైన్స్ ఆలోచనల కోసం సమాజంలో అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయని ఆయన అన్నారు. ఈ విషయంలో కరోనాపై పోరాటంలో సీఎస్ఐఆర్ కీలక పాత్ర పోషించిందని, ముఖ్యంగా కోవిడ్ వ్యాక్సిన్ కు సహాయక ఔషధాన్ని అభివృద్ధి చేయడంలో సీఎస్ఐఆర్-ఐఐసీటీ పాత్ర ప్రశంసనీయమని కొనియాడారు. అనుభవం ఆధారిత అభ్యసనను భారత్ ప్రోత్సహిస్తోందని, సీఎస్ ఐఆర్ ఇందులో ముందంజలో ఉందన్నారు.

హైదరాబాద్ ఫార్మా సిటీ (హెచ్ పీసీ) హైదరాబాద్ లో ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ క్లస్టర్ అని, ఫార్మా పరిశ్రమలకు ఆర్ అండ్ డీ, మాన్యుఫ్యాక్చరింగ్ కు పెద్దపీట వేశామని, జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత దృష్ట్యా ఈ క్లస్టర్ ను భారత ప్రభుత్వం నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్జ్)గా గుర్తించిందని డాక్టర్ జితేంద్రసింగ్ తెలిపారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసిన హైదరాబాద్ ఫార్మా సిటీ ఫార్మాస్యూటికల్ వాల్యూ చైన్ లో సహజీవనానికి నిజమైన విలువను అందిపుచ్చుకుంటుందని తెలిపారు.

సిఎస్ఐఆర్-ఐఐసిటి అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానమే భారత్లో ఆగ్రోకెమికల్ పరిశ్రమ అభివృద్ధికి నాంది పలికిందన్న వాస్తవాన్ని ఆగ్రోకెమికల్ పరిశ్రమ విస్తృతంగా అంగీకరిస్తోందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్ మెంట్ (ఐపీఎం)లో మానిటరింగ్, సర్వైలెన్స్ టూల్ గా ఫెరోమోన్ అప్లికేషన్ టెక్నాలజీ (పీఏటీ)ని ఉపయోగించవచ్చని సిఎస్ఐఆర్ - ఐఐసిటి నిరూపించింది.

ఆత్మనిర్భర్ భారత్ కలను సాకారం చేయడానికి సుస్థిర పరిష్కారాలను అభివృద్ధి చేయడం ద్వారా సృజనాత్మక సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్రపంచవ్యాప్తంగా పోటీ ఆర్ అండ్ డి ద్వారా భారత పౌరుల జీవన నాణ్యతను పెంపొందించడంపై సిఎస్ఐఆర్ ఊవీఏ2030 విజన్ ను కలిగి ఉంది. సిఎస్ఐఆర్ ఈ దార్శనికత రాబోయే 25 సంవత్సరాల 'అమృత్ కాల్ ' అంటే భారత స్వాతంత్ర్యానికి వందేళ్ల నాటికి భారత ప్రభుత్వం నిర్దేశించుకున్న దార్శనికతకు అనుగుణంగా ఉంది. ఈ ప్రయత్నంలో, దేశంలో సైన్స్ సెంటర్లు, సైన్స్ సిటీల ఏర్పాటు కూడా దేశంలోని భావి శాస్త్రవేత్తలను పెంపొందించడానికి పునాది అవుతుంది.

# హైదరాబాద్ కంటే మిన్నగా వైజాగ్ లో అభివృద్ధి - జగన్ ..

అమరావతి, మార్చి 5:రాష్ట్రంలో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలోనే వ్యవసాయం రంగంలో ఏపీలో 70 శాతం వృద్ధి సాధించామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విశాఖ పర్యటనలో భాగంగా నేడు ఆయన జీవీఎంసీ వీఎంఆర్డీఏకి చెందిన దాదాపు రూ. 1500 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం రాడిసన్ బ్లూ హోటల్ లో నిర్వహించి ఏపీ డెవలప్‌మెంట్




సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సుకు రెండు వేల మందికి పైగా పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు..

ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ, రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ ను కోల్పోయామని దాని ప్రభావం ఏపీపై ఎంతో ఉందని అన్నారు. తాము తీసుకుంటున్న చర్యల వల్ల . హైదరాబాద్ కంటే మిన్నగా వైజాగ్‌లో అభివృద్ధి జరుగుతోందని సీఎం తెలిపారు. ఉత్పత్తి రంగంలో దేశంలో ఏపీ మెరుగ్గా ఉందని.. అభివృద్ధిలో విశాఖ నగరం దూసుకెళ్తోందని తెలిపారు. రాయపట్నం, కాకినాడ, మూలపేట, మచిలీపట్నం పోర్టులు ఎంతో కీలకమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు హైదరాబాద్‌కే పరిమితమయ్యాయని తెలిపారు. ఏపీలో తలసరి ఆదాయం పెరిగిందంటూ . గత పదేళ్లలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు.

### ఏపీలో నిరుద్యోగం తగ్గింది

ప్రతి సంక్షేమ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని సీఎం జగన్ తెలిపారు. డీబీటీ పద్దతి ద్వారా నేరుగా లబ్దిదారులకు నగదు అందజేస్తున్నామని అన్నారు. ఏపీలో మహిళల అభివృద్ధికి ప్రభుత్వ కృషి చేస్తోందని చెప్పారు. వ్యవసాయానికి ఏపీలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని.. సముద్రతీరంలో పోర్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఏపీలో నిరుద్యోగం తగ్గిందని.. ఉపాధి అవకాశాల పెరిగాయని జగన్ చెప్పారు..

### వైజాగ్‌లోనే సిఎం ప్రమాణం చేస్తా

వచ్చే ఎన్నికల అనంతరం వైజాగ్ నుంచే పాలన సాగిస్తానని జగన్ స్పష్టం చేశారు. మళ్లీ గెలిచి వచ్చాక వైజాగ్‌లోనే ప్రమాణ స్వీకారం చేస్తానని అన్నారు. విశాఖ అభివృద్ధికి అన్ని విధాలుగా కట్టుబడి ఉంటానన్నారు.

# మాటిచ్చారు..తీవ్ర సమస్య తీర్చారు..

- మంత్రి పొంగులేటి చొరవతో కైకొండాయిగూడెంలో డ్రెయినేజీ తిప్పలకు పరిష్కారం



ఖమ్మం, మార్చి 4 :(నేటినిజం ప్రతినిధి): మంత్రి పొంగులేటి మాటిచ్చారంటే ఆ పని పూర్తవ్వాల్సిందే. అందుకు కైకొండాయిగూడెం ఘటన ఓ చిన్న ఉదాహరణ. రాష్ట్రరెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జనవరి 31వ తేదీన కైకొండాయిగూడెం (ఒకటో డివిజన్) లోని గణేష్ టౌన్షిప్ ప్రాంతాన్ని సందర్శించారు. ఆ ప్రాంతంలో కలియ తిరిగి.. స్థానికులతో ముచ్చటించగా.. గణేష్ టౌన్షిప్ ప్రాంతంలో మురుగు సమస్యను విన్నవించారు. దీంతో స్పందించి ఆయన సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించడంతో సత్వర చర్యలు చేపట్టారు. పొక్లేయిన్ ద్వారా కొత్తగా సైడ్ కాల్వ తవ్వించారు. పూడుకుపోయిన పాత డ్రేయినేజీలో మురుగు తొలగించే పనులు పూర్తి చేయించారు. దీంతో చాలా కాలంగా పెండింగ్లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం లభించిందని ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గణేష్ టౌన్షిప్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, విహార అపార్ట్మెంట్ కార్యదర్శి గంగాధర్, స్థానికులు మంత్రి పొంగులేటికి తమ కృతజ్ఞతలు తెలిపారు.

# వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలి: మంత్రి పొంగులేటి



ఖమ్మం, మార్చి 5 :(నేటినిజం ప్రతినిధి): వైద్యులు అందుబాటులో ఉండి, రోగులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, ఖమ్మం రూరల్ మండలంలోని తెల్దారుపల్లి లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాధమిక ఆరోగ్య ఉపకేంద్ర నూతన భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విద్య, వైద్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. పేదవారికి మంచి వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పేదవానికి భరోసా ఇవ్వాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించాలని అన్నారు. అర్థరాత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు ఉంటారని, వైద్యం అందుతుందనే భరోసా ప్రజలకు ఇవ్వాలని అన్నారు. ప్రజల అభీష్టం మేరకు ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అభయహస్తం క్రింద ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఇప్పటికే 4 గ్యారంటీలు ప్రజల గుమ్మంకు చేర్చామన్నారు. ఈ నెల 11న భద్రాచలం శ్రీరాముల వారి సన్నిధిలో 5వ గ్యారంటీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వబోతున్నట్లు ఆయన తెలిపారు. ఇచ్చిన ప్రతి మాటను తూ.చ. తప్పకుండా ప్రజలకు అందిస్తావన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఇ చంద్రమౌళి, ఎస్డీపివో నీలోహన, ఖమ్మం రూరల్ ఎంపిపి బెల్లం ఉమ, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్..హస్టల్ లో పురుగుల అన్నం

## - ఆందోళనకు దిగిన విద్యార్థులు... క్యాంపస్ లో ఉద్రిక్తత

హైదరాబాద్ మార్చ్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ హాస్టల్ లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. హైదరాబాద్ శివారు గండి మైసమ్మ లో ఉన్న ఓఖీఇఅ క్యాంపస్ వసతి గృహంలో 2024, మార్చి 4వ తేదీ సోమవారం రాత్రి విద్యార్థులు ఆందోళనకు దిగారు.రాత్రి భోజన సమయంలో అన్నం, స్వీట్ లో పురుగులు రావడంతో విద్యార్థులు యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ క్యాంపస్ లో నిరసన చేపట్టారు. క్వాలిటీ ఫుట్ పెట్టడం లేదని.. వీ వాంట్ జస్టీస్ అంటూ నినాదాలు చేశారు.ఇటీవల కూడా మల్లారెడ్డి కాలేజ్ లో పురుగుల అన్నం పెడుతున్నారని విద్యార్థులు, విద్యార్థి సంఘాల ధర్నాలు చేశారు. దీంతో ఫుడ్ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటామని, విద్యార్థులకు క్వాలిటీ ఫుడ్ పెడతామని కాలేజీ చైర్మన్ మల్లారెడ్డి హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు. అయితే, కొద్ది రోజులకే మళ్లీ అన్నంలో పురుగులు రావడంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మల్లారెడ్డి వచ్చేంత వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. దీంతో క్యాంపస్ లో ఉద్రిక్తత నెలకొంది.

# 200 యూనిట్లు దాటితే ఉచిత పథకం వర్తించదా- రేవంత్ కు హరీష్ లేఖ



హైదరాబాద్, మార్చి 5 : రాష్ట్రంలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుకునే వినియోగదారులకు ఎలాంటి బిల్లు వసూలు చేయవద్దనే ప్రభుత్వ పథకంలో జరుగుతున్న పొరపాటు వల్ల లక్షలాది మంది అర్హులకు అన్యాయం జరుగుతుంది అని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఈ మేరకు నేడు ఆయన రేవంత్ కు ఒక బహిరంగ లేఖ రాశారు.. కేవలం 200 యూనిట్ల వరకు వినియోగించిన వారికి అధికారులు జీరో బిల్లు ఇస్తున్నారని, .. కానీ, ఒక్క యూనిట్ ఎక్కువ వచ్చినా సరే మొత్తం 201 యూనిట్లకు బిల్లు వసూలు చేస్తున్నారు అని పేర్కొన్నారు. వినియోగదారులు ప్రతీ రోజు పొద్దున లేచి తాము ఎంత కరెంటు కాలుస్తున్నాము? మీటర్ ఎంత తిరుగుతుంది? అనేది చూసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయన మండిపడ్డారు. 200 యూనిట్లు దాటితే 200 యూనిట్ల వరకు అయ్యే భారాన్ని ప్రభుత్వమే భరించి.. మిగతా యూనిట్ల ధరను వినియోగదారుడు చెల్లించే విధంగా బిల్లింగ్ వ్యవస్థలో మార్పులు చేయాలని హరీశ్ రావు కోరారు..

**90 లక్షలు తెల్లకార్డులు .. పథకం మాత్రం 30 లక్షల మందికే ..**

ఇక, తెలంగాణ రాష్ట్రంలో 90 లక్షల మంది తెల్లరేషన్ కార్డులుంటే.. ప్రభుత్వం కేవలం 30 లక్షల మందికి మాత్రమే ఈ పథకాన్ని అమలు చేస్తుందని హరీశ్ అన్నారు. మిగతా 60 లక్షల మందికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.. హైదరాబాద్ నగరంలో కూడా 30 లక్షల మంది పేదలుంటే, కేవలం 10 లక్షల మందికే పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వివరించారు? కేవలం మూడో వంతు పేదలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, .. రెండు వంతుల పేదలను విస్మరిస్తున్నారు.. ఇది సరైంది కాదు అని ఆయన పేర్కొన్నారు. ఇక ఒక రేషన్ కార్డు కింద ఒక కుటుంబాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నారని, .. ఒక రేషన్ కార్డులో పేర్లున్న వారు రెండు మూడు కుటుంబాలుగా కూడా విడిపోయి బతుకుతున్నారని అని వెల్లడించారు.

ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో వేర్వేరు అంతస్తుల్లో ఉంటున్నారని, .. కానీ, ప్రభుత్వం వారందరినీ ఒకే కుటుంబంగా లెక్క కట్టి ఒక్కరికే పథకం వర్తింప చేస్తుంది అని హరీశ్ రావు అన్నారు. ఇది కూడా సరైన పద్ధతి కాదన్నారు. ఎన్ని కుటుంబాలుంటే అన్ని కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింప చేయాలన్నారు. నిజమైన పేదలకు న్యాయం చేయడమే మీ ప్రభుత్వ లక్ష్యమైతే.. మొత్తం 90 లక్షల పేద కుటుంబాలకు లబ్ది కలిగేలా చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో ఈ పథకం కేవలం నామమాత్రంగానే మిగిలిపోతుందన్నారు. హామీల అమలుకు ప్రభుత్వమే తూట్లు పొడిచినట్లు అవుతుందనే విషయాన్ని మీ దృష్టికి తెస్తున్నానని అన్నారు? నిజంగా పేదలకు సాయం చేయాలనే చిత్తశుద్ధి మీకుంటే.. వెంటనే పై మూడు విషయాల్లో తక్షణం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# మూడు నెలల్లోనే ప్రజల్లో తీవ్ర విముఖత : మంత్రి కొప్పుల ఈశ్వర్



మంచిర్యాలటౌన్, మార్చి 5: సాధ్యంకాని హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీపె ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంచిర్యాల నియోజక వర్గంలోని దండేపల్లి, లక్షెటిపేట మండలాల్లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. అదే విధంగా మంచిర్యాలలోని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసంలో హాజీపూర్, నస్పూర్, మంచిర్యాల పట్టణాల ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు.

రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసమే పుట్టిన ఉద్యమ పార్టీని ప్రజలు గెలిపించుకుంటారని, ఇక్కడి ప్రజల తరపున పార్లమెంటులో గళం విప్పాలంటే కేవలం బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ అయితేనే సాధ్యపడుతుందని చెప్పారు. కార్యకర్తలు, నాయకులు పార్లమెంటు ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని, కాంగ్రెస్ మోసాలను వివరించాలని అన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా పెద్దపల్లి జిల్లాకు పేరుందని గుర్తు చేశారు.

ఈ ప్రాంతంతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారం తెలిసిన వ్యక్తి అయితేనే బాగుంటుందని, అధినేత కేసీఆర్ తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో అన్ని ప్రాంతాలు, అన్ని రంగాలు అభివృద్ధి చెందాయని గుర్తు చేశారు. అన్ని మతాల విశ్వాసాలను, మనోభావాలను కేసీఆర్ ప్రభుత్వం కాపాడిందని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలు.. నామినేషన్ దాఖలు చేసిన సీఎం నితీశ్ కుమార్

న్యూఢిల్లీ, మార్చి 5: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీహార్ సీఎం నితీశ్ కుమార్ తన నామినేషన్‌ను ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఎన్నికల అధికారికి మంగళవారం సమర్పించారు. ఈ ఏడాది మే తొలి వారంలో నితీశ్ కుమార్ ఎమ్మెల్సీ పదవీ కాలం ముగియనుంది. నితీశ్‌తో పాటు రబ్రీదేవి(ఆర్జేడీ), సయీద్ షానవాజ్ హుస్సేన్(బీజేపీ), సంజయ్ కుమార్ ఝా(జేడీ-యూ), ప్రేమ్ చంద్ర మిశ్రా(కాంగ్రెస్), సంతోష్ కుమార్ సుమన్(హెచ్ఏఎం-ఎస్), మంగళ్ పాండే(బీజేపీ), రామ్ చంద్ర పుర్వే(ఆర్జేడీ), ఖలీద్ అన్వర్(జేడీ-యూ), రామేశ్వర్ మహతో(జేడీ-యూ), సంజయ్ పాశ్వాన్(బీజేపీ) పదవీ కాలం కూడా మే నెలలో ముగియనుంది.

ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఈ నెల 11వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరితేదీ మార్చి 14. మార్చి 21వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ జరగనుంది. అదే రోజు ఫలితాలను వెల్లడించనున్నారు.

ప్రస్తుతం బీహార్ అసెంబ్లీలో ఉన్న బలబలాల ప్రకారం.. ఆరు స్థానాలను ఎన్డీఏ కూటమి కైవసం చేసుకునే అవకాశం ఉంది. మిగతా ఐదు స్థానాలు మహాఘటబంధన్ గెలిచే అవకాశం ఉంది. జేడీ-యూకు 45 ఎమ్మెల్యేల బలం ఉంది. అంటే ఈ పార్టీకి రెండు స్థానాలు దక్కే అవకాశం ఉంది. ఇందులో ఒకరు సీఎం నితీశ్ కుమార్. మరో స్థానం మైనార్టీ కమ్యూనిటీ నాయకుడికి వెళ్లే అవకాశం ఉంది.

# పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం పల్స్ పోలియో చుక్కలు

-కుమ్మరవాడి అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ లో రెడ్ క్రాస్ పల్స్ పోలియో



హైదరాబాద్ మార్చ్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ ఆద్వర్యం లో ఈ నెల 3 నుండి 6 వ తేది వరకు హైదరాబాద్ నగరం లో వివిధ ప్రాంతాలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి తెలిపారు. గోల్కొండ లో ని కుమ్మరివాడు, అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ లో జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. పల్స్ పోలియో చుక్కలు పిల్లలకు భవిష్యత్తులో పోలియో వ్యాధి నుండి దూరం చేస్తాయని తద్వారా వారి ఉజ్వల భవిష్యత్తు సంతోషంగా సాగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కుమ్మరి వాడి అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అయేషా, గోల్కొండ మండల్ కన్వీనర్ సలావుద్దీన్ ఖాన్ మరియు ఇందిరా ప్రియదర్శిని గవర్నమెంట్ మహిళా డిగ్రీ కాలేజ్, నాంపల్లి యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు ఆదివారం నుండి తమ సేవలను అందిస్తున్నారు.

# బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ ..

## బీసీ డిక్లరేషన్‌ను విడుదల చేసిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్

అమరావతి, మార్చి 5: ఏపీలో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో కూటమి నాయకులు వెల్లడించారు. బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ అందజేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పది అంశాలతో కూడిని బీసీ డిక్లరేషన్ పత్రాన్ని విడుదల చేశారు.

పింఛన్ నెలకు రూ. 4వేలకు పెంచుతామని , బీసీల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకువస్తామని, సామాజిక న్యాయపరిశీల కమిటీ ఏర్పాటు , సబ్ ప్లాన్‌తో ఐదేళ్లలో రూ. లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. సబ్‌ప్లాన్ నిధులు బీసీలకే వినియోగించేలా చర్యలు , స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్ పునరుద్ధరణ, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేస్తామని ప్రకటించారు.అన్ని సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్, కొన్ని బీసీ వర్గాలకు కోఆప్షన్ సభ్యులుగా అవకాశం, జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్లు ఏర్పాటు, జనామా దామాషా ప్రకారం నిధులుకేటాయింపు చేస్తామని వెల్లడించింది. స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ. 10 వేల కోట్లు ఖర్చు చేస్తామని, రూ. 5 వేల కోట్లతో ఆదరణ పరికరాలు అందజేస్తామని సభ ప్రకటించింది.

# యూపీఎస్సీ సర్వర్ డౌన్.. ఆందోళనలో సివిల్ అభ్యర్థులు..

న్యూఢిల్లీ, మార్చి 5: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సర్వర్ డౌన్ అయింది. మార్చి 5వ తేదీ(మంగళవారం) సాయంత్రం 6 గంటలకు దరఖాస్తుల గడువు ముగియనున్నట్లు నోటిఫికేషన్‌లోనే యూపీఎస్సీ పేర్కొంది. దీంతో మంగళవారం ఉదయం నుంచే అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు యూపీఎస్సీ వెబ్‌సైట్‌ను లాగిన్ చేశారు. అయితే మధ్యాహ్నం నుంచి సర్వర్ డౌన్ అయింది. దీంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల స్వీకరణ తేదీని పొడిగించాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఇలా సర్వర్ డౌన్ కావడంతో.. చాలా మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించి, మరో రెండు రోజులు గడువు పొడిగించాలని అభ్యర్థించారు.

# అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్



ఖమ్మం, మార్చి 5 :(నేటినిజం ప్రతినిధి): అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ముదిగొండ తహసీల్దార్, ఎంపిడివో కార్యాలయాల ఆకస్మిక తనిఖీ చేసి, ధరణి, ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు.

దరఖాస్తుల క్షేత్ర పరిశీలన పారదర్శకంగా చేయాలన్నారు. ఆమోదయోగ్యంగా ఉన్న ప్రతి దరఖాస్తును ఆమోదించి, న్యాయం చేయాలన్నారు. తిరస్కరణ కు గురయిన దరఖాస్తు కు తగు కారణం పొందుపర్చాలన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ద్వారా అర్హులైన వారందరూ ప్రయోజనం పొందేలా, అన్ని ఎంపిడివో, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవాకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా దరఖాస్తు చేసుకోలేక పోయిన అర్హులైన వారితో పాటు, దరఖాస్తులో సరైన వివరాలు నమోదు చేయని వారికోసం ప్రజాపాలన కేంద్రాలని, పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 వరకు పనిచేస్తాయన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా ముదిగొండ తహసీల్దార్ వై.రామారావు, సిబ్బంది తదితరులున్నారు.

# కమ్యూనిస్టు విప్లవ శక్తులు వ్యక్తులను అఖిలభారత యునైటెడ్ పార్టీగా ఏకం చేయండి

## – సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్రనాయకులు సంజయ్ సింగ్వి పిలుపు




ఖమ్మం, మార్చి 5 :(నేటినిజం ప్రతినిధి): కమ్యూనిస్టు విప్లవ శక్తులు, వ్యక్తులను అఖిలభారత యూనైటెడ్ పార్టీగా ఏకం చేయడని, నేటి పరిస్థితి మాస్ ఆర్గనైజేషన్ స్థాయిలో ముఖ్యంగా యూనియన్ ఐక్యతను కోరుతుందని, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర నాయకులు సంజయ్ సింగ్వి పిలుపునిచ్చారు. అమెరికా సామ్రాజ్య వాదం నాటో కూటమి ద్వారా వర్షా చైనా పైన దూకుడుగా వ్యవహరిస్తుందని, పాలస్తీనాపై ఇజ్రాయిల్చేస్తున్న దుర్మార్గాలను అమెరికా సమర్థిస్తుందని ప్రపంచ దేశాలు ఈ దుర్మార్గపు మారణకాండలను వ్యతిరేకిస్తూ పోరాడాలని సంజయ్ సింగ్వి పిలుపునిచ్చారు. ప్రపంచ ప్రజలు నేడు చాలా ప్రమాదకరమైన కాలములో జీవిస్తున్నారని, తాజాగా పాలస్తీనా, ఉక్రెయిన్ ప్రజల పైన జరిగిన దారుణ మారణకాండ కనిపిస్తున్నదని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీ నాయకులు సంజయ్ సింఘ్వి ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 5వ తేదీన మంగళవారం ఖమ్మంలో (భక్త రామదాసు కళాక్షేత్రంలో) కామ్రేడ్ డి వీ కృష్ణ, సంతోష్ రానా నగర్లో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర మహాసభలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సంజయ్ సింగ్వి పార్టీ కార్యక్రమాన్ని ప్రతినిధులకు వివరించారు. పాలస్తినా ప్రజల వీరోచిత పోరాటాలను ప్రస్తావించకుండా ఉండలేమని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా రాజ్యాధికారంలో, సమాజంలో తీవ్ర మతవాదం పెరుగుతుందనీ, కోడి, ఫాసిస్టు పోకడలు గల ఇతర ప్రభుత్వాలతో పాటు విక్టర్ ఓర్బన్ హంగేరీలో, జర్మనిలో ని అల్ట్రా రైట్ పాలిస్తున్నారన్నారు. ఒకప్పుడు సగానికి పైగా ప్రపంచాన్ని పాలించిన కమ్యూనిస్టు, సోషలిస్ట్ పార్టీలు ప్రపంచ వ్యాప్తంగా నేడు అల్పమైనవిగా అయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భారతదేశంలో కూడా ఫాసిజం ప్రత్యేకంగా ఆర్ఎస్ఎస్, బిజెపి చారిత్రకంగా సామాజిక ఆర్థిక స్థితిలో అభివృద్ధి చెందుతుందని, ఈ పది సంవత్సరాల కాలంలో మోడీ పాలన విధానం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగ సంస్థల ప్రాముఖ్యతను తగ్గిస్తూ, క్రోనీ క్యాపిటల్ లిస్టు అలానే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని ఎవరైతే వ్యతిరేకిస్తున్నారో పార్టీలు సంస్థలు జర్నలిస్టులు వ్యక్తులు అందర్నీ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన అన్నారు. ఫాసిస్ట్, ఆర్ఎస్ఎస్ నిర్దిష్ట లక్ష్యం హిందూ రాష్ట్రాన్ని నిర్మించాలని మనస్మృతి రాజ్యాంగంగా గోల్వాల్కర్ బోధనలు మార్గదర్శకంగా నాధూరం గాడ్సే ను జాతీయ హీరోగా కల్తీ లేని పాసిజాన్ని తీసుకురావటవమే మోడీ ప్రధాన లక్ష్యమని విమర్శించారు. ప్రజల ప్రధాన కర్తవ్యం ఆర్ఎస్ఎస్ ఫాసిజాన్ని సిద్దాంత, రాజకీయ నిర్మాణపరంగా ఓడించాలని ఆల్ ఇండియా కమ్యూనిస్టు పార్టీ (అఖిలభారత కమిటీ పార్టీ) అత్యవసరమైనదని ఆయన పిలుపునిచ్చారు. మూడు విప్లవ పార్టీలు కమ్యూనిస్టు సంస్థల విలీనం అనేది మొదటి అడుగని ఈ ఐక్యత కార్యక్రమాలు సుదీర్ఘంగా కొనసాగాలని(లాంగ్ మార్చ్) ఆయన ఆకాంక్షించారు. పార్టీ నిబంధన అనే అంశంపై సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, మాస్ లైన్ కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీ నాయకులు పోటు రంగారావు ప్రసంగిస్తూ మోడీ ప్రభుత్వం రేసిస్ట్, పాసిస్టూ, జియోనిస్ట్ నేతన్యహు కు మద్దతు ఇవ్వడం మూలంగా పాలస్తిన ప్రధానమంత్రి, ఇతర దేశాల నాయకులలో పెద్ద స్థాయిలో సత్య జరుగుతుందని ఆయన అన్నారు. పాసిస్టూ ఆర్ఎస్ఎస్ బిజెపి పాలన వల్ల భయాందోళనలను హింసను ఎదుర్కొంటున్న ప్రజలు వాటిని అధికమించి ఆ వ్యతిరేకతను బహిరంగంగా వ్యక్తీకరిస్తే వారి ఓటమికి కారణాలు అవుతాయని ఆయన అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ప్రభుత్వం ఎక్కడైతే కొనసాగుతుందో అక్కడ రెండింటిని వ్యతిరేకించడం కూడా ముఖ్య కర్తవ్యం అని ఆయన అన్నారు. నయా పాసిస్టూ ఆర్ఎస్ఎస్ బిజెపిలు పార్లమెంటరీ విధానాన్ని సంపూర్ణంగా వినియోగించుకుంటూ రాజ్యాంగ వ్యవస్థలను ప్లానింగ్ కమిషన్ తదితరమైన వాటిని అన్న చెప్పు చేతలలో కొనసాగించటం బహిర్గతమైనదని ఆయన అన్నారు. దేశంలో అధిక ధరలు వ్యవసాయ పెట్టుబడులలో తక్కువ రాబడులు కారణంగా రైతులు ఆర్థికంగా వెనక పడుతున్నారని ఆయన అన్నారు. ఈ దుస్థితికి కారణం నయాఉదారవాద విధానాలని ఆయన అన్నారు. మోడీ ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్లో మహిళల అభివృద్ధికి ఏమాత్రం నిధులు కేటాయించకపోవడం. భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య నిరుద్యోగం, మనదేశంలో ఇప్పుడు ఉన్న నిరుద్యోగ ఉపాధి కొరత సంక్షోభాన్ని చూసినప్పుడు యువతలో ఒక వర్గానికి సులభంగా రుణాలు అందించాలని మోడీ ప్రభుత్వ వ్యూహం ఒక జోకులాగా అనిపిస్తుందని ఆయన అన్నారు. ఈ మహాసభలలో వేదికపై అధ్యక్ష వర్గంగా కేజీ రామచంద్ర, కే. రామచందర్, కె. రమ, దినేష్ గోహైన్, ధ్రువ, రిషి వ్యవహరించారు. స్టీరింగ్ కమిటీ సభ్యులుగా ప్రదీప్ సింగ్ ఠాగూర్, కెచ్చెల రంగయ్య, దేవవ్రత శర్మ, ఉమాకాంత్ వ్యవహరించారు. వివిధ రాష్ట్రాల నుండి హాజరైన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఇతర కళా సంస్థల బృందాలు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు హిందూ మతోన్మాద ఫాసీజం కులతత్వం, దోపిడీపై, మహిళలు నిరుద్యోగ సమస్య, వ్యవసాయ రంగ సమస్యపై పాడిన పాటలు సభాకులను అలరింపజేశాయి.

# మంత్రి రోజా పై మండిపడుతున్నారు ఆమె అనుచరులు

## –ఆమెకు మరోసారి టికెట్ ఇస్తే పనిచేయం.. నియోజకవర్గ నేతల హెచ్చరిక

అమరావతి మార్చ్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆంధ్రప్రదేశ్ టూరిజం, క్రీడల శాఖ మంత్రి రోజా పై ఆమె అనుచరులు మండిపడుతున్నారు.

ఆమెకు టికెట్ ఇవ్వొద్దని వైసీపీ అధిష్ఠానానికి మంగళవారం విజ్ఞప్తి చేశారు. నగరి నియోజకవర్గానికి చెందిన ఐదు మండలాల వ్యతిరేక వర్గం నాయకులు మీడియా సమావేశాన్ని నిర్వహించి నియోజకవర్గంలో రోజాకుకాకుండా మరెవరికైనా టికెట్ ఇవ్వాలని కోరారు.రెండు సార్లు పార్టీ, అభ్యర్థి రోజాను గెలిపించుకునేందుకు అహర్నిశలు, శక్తివంచన లేకుండా పనిచేశామని తెలిపారు.

ఐరన్ లెగ్ పేరున్న రోజాను నియోజకవర్గ వైసీపీ నాయకులంతా గోల్డెన్ లెగ్ గా మార్చామని పేర్కొన్నారు. అయితే నియోజకవర్గంలో ఆమె సోదరులు చేస్తున్న దోపిడికి అడ్డుగా ఉన్నామనే అక్కసుతో మమ్మల్ని దూరంగా పెట్టి వేధిస్తున్నారని వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, పుత్తూరు నేత అమ్ములు, లక్ష్మీపతిరాజు, మండలాల వైసీపీ నాయకులు ఆరోపించారు. వ్యతిరేకవర్గం నేతలు ఎవరైనా సరే అవినీతి పాల్పడి ఉంటే దానిపై రోజాతో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

వైసీపీ అధికారంలోకి రాకముందు అప్పుల్లో ఉన్న రోజా మంత్రి అయ్యాక ఎంత సంపాదించిందో అందరికీ తెలుసని విమర్శించారు. పుత్తూరు నగరిలో ఎక్కడ చూసినా భూ కబ్జాలు, దౌర్జన్యాలు, దోపిడీలు జరుగుతున్నాయని మండిపడ్డారు. మంత్రి రోజాకు మరోసారి వైఎస్ఆర్ అధిష్టానం సీటు ఇస్తే తాము పనిచేయాబోమని స్పష్టం చేశారు.

# ఎట్టకేలకు ఫలించిన వైసీపీ అపరేషన్ ముద్రగడ

## –భేషరతుగా వైసీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు ముద్రగడ ఫ్యామిలీ..



అమరావతి మార్చ్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఎట్టకేలకు వైసీపీ అపరేషన్ ముద్రగడ ఫలించింది. భేషరతుగా వైసీపీలో చేరేందుకు ముద్రగడ ఫ్యామిలీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఎలాంటి టికెట్ ఆశించకుండానే ఆయన పార్టీలో చేరబోతున్నట్లు సమాచారం.పవన్ కళ్యాణ్‌తో కలిసి నడవాలని కాపు నేత ముద్రగడ పద్మనాభం ముందు నుంచి అనుకున్నారు. కానీ టీడీపీతో పొత్తు పెట్టుకోవడం.. సీట్ల పంపకంలోనూ రాజీ పడటం ముద్రగడకు నచ్చలేదు. పవర్ షేరింగ్ అడగకుండా 24 అసెంబ్లీ స్థానాలకే పరిమితం కావడాన్ని ఇటీవల ఆయన బహిరంగంగా కూడా విమర్శించారు. ఇది కాకుండా మొదట్నుంచి కూడా ముద్రగడకు పవన్ సరైన రెస్పాన్స్ ఇవ్వలేదు. ముద్రగడను ప్రత్యేకంగా కలుస్తానని పలుమార్లు హామీ ఇచ్చిన పవన్ మాట తప్పారు. ఈ తీరు పవన్‌పై ఆగ్రహానికి కారణమయ్యాయి. ఈ క్రమంలోనే తాడేపల్లిగూడెం సభలో పవన్ కళ్యాణ్ మాటల తర్వాత ముద్రగడ మనసు మారినట్టు తెలుస్తోంది. పవన్ కళ్యాణ్ స్వయంగా తన ఇంటికి వస్తారని.. మాట్లాడతారని ఆశించిన ముద్రగడకు ఆ పరిణామాలు కనిపించలేవు. దీన్ని ముద్రగడ వర్గం ఆయనకు జరిగిన అవమానంగా భావించాయి. జనసేనతో ముద్రగడకు చెడిందని తెలియడంతో వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. ఆపరేషన్ ముద్రగడ పేరుతో ఆయన్ను వైసీపీ పార్టీ వైపు తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. అందులో సఫలమయ్యింది.కాపు ఉద్యమ నేత అయిన ముద్రగడను తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా పవన్ కళ్యాణ్‌కు చెక్ పెట్టాలని వైసీపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ముద్రగడ అయితేనే పవన్‌పై బలమైన అభ్యర్థి అవుతారని అనుకుంటున్నది. అయితే ఇప్పటికే పిఠాపురం వైసీపీ ఇన్‌చార్జిగా వంగా గీతను వైఎస్ జగన్ నియమించారు. ఈ క్రమంలో వంగా గీతను సీఎంవోకు పిలిపించుకుని సీఎం జగన్ చర్చలు జరిపారు. పిఠాపురం టార్గెట్‌గా గైడెన్స్ ఇచ్చారు.

# మాడుగుల ప్రవీణ్ కి ఘన నివాళులు అర్పించిన బిజెపి జిల్లా శాఖ..

## –పవీణ్ నిబద్ధత గల బిజెపి నాయకుడు,.. మృతి తీరని లోటు...

## –బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



కరీంనగర్, మార్చి 5: (నేటినిజం ప్రతినిధి) బీజేపీ కరీంనగర్ జిల్లా కార్యాలయ కార్యదర్శి మాడుగుల ప్రవీణ్ కుమార్ అకాల మృతి పట్లజిల్లా శాఖ సంతాపం వ్యక్తం చేసి, ఘన నివాళులు అర్పించింది . జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు హుజురాబాద్ పట్టణంలోని ప్రవీణ్ నివాసానికి వెళ్లి ఆయన పార్థివ దేహం పై పార్టీ పతాకాన్ని కప్పి అనంతరం అంతిమయాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, నియమ నిబద్ధతతో భారతీయ జనతా పార్టీ కోసమే ప్రవీణ్ నిరంతరం కృషి చేశారని , ఆయన మృతి తీరని లోటన్నారు. ఇటీవల గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రవీణ్ , అకాల మరణం చెందడం విచారకరమన్నారు. జిల్లా పార్టీ పక్షాన ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నామని, వారి కుటుంబ సభ్యులందరికీ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని , ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్టు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. హుజురాబాద్ పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు మండల అధ్యక్షులు రాముల కుమార్, నల్ల సుమన్, గంగిశెట్టి ప్రభాకర్ , వేణు ,తుర్పాటి రాజు యాంసాని శశిధర్ ,వినయ్, చైతన్య రాజశేఖర్ , నగేష్ ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# ముస్లిం కమ్యూనిటీ హాల్ కు రూ. 4 లక్షలు మంజూరు

## –ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు ముస్లింల కృతజ్ఞతలు



రాజన్న సిరిసిల్ల, మార్చి 5:(నేటి నిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని 1వ వార్డులో ముస్లిం కమ్యూనిటీ హాల్ కొరకు మజూరైన 4 లక్షల రూపాయల మంజూరీ పత్రాన్ని మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మైనార్టీ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు ముస్లీంలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మైనార్టీ జిల్లా కార్యదర్శి అబ్దుల్ రజాక్, పట్టణ మైనార్టీ సెల్ అద్యక్షుడు షేక్ సబీర్, పీర్ మొహమ్మద్, షేక్ ఫిరోజ్, సయ్యద్ సాబీర్, యూసఫ్, అతహుల్ రహెమన్, ఓల్లి మొహమ్మద్, సోహెల్ ఖాన్, షేక్ ఇర్ఫాన్, ఎండీ తాజ్ లు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి

## –ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, మార్చి 5:(నేటినిజం ప్రతినిధి): ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ గురువారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొట్టమొదటి సారిగా ముఖ్యమంత్రి హోదాలో రాజన్న సిరిసిల్లకు వస్తున్నారని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు. 7 తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్ ద్వారా సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చేరుకొని, జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించి,జిల్లా కేంద్రంలో మిగతా అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. సేఫ్టీ మోకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.. ముఖ్యమంత్రి హోదాలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికీ పట్టు వస్త్రాలు సమర్పించి,స్వామి వారిని దర్శనం చేసుకుంటారని తెలిపారు. అనంతరం బాలానగర్ లో జరిగే బహిరంగ సభ పాల్గొంటారని అన్నారు. వీటిడిఏ సమావేశం ద్వారా గతంలో ఆగిపోయిన నిధులను తిరిగి తీసుకొచ్చామని అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి పర్యటన మన జిల్లా తో పాటు,నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు.

ప్రజలు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

హైదరాబాద్, మార్చి 5 :రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మరణించిన విషాదకర సంఘటన సరూర్‌నగర్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీ.ఎం. హోం వద్ద మంగళవారం తెల్లవారుజామున ఐదున్నర గంటల ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వాహనం డీ కొని సాయమ్మ ( 50) అనే మహిళ తీవ్ర గాయపడింది.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సాయమ్మను ఉస్మానియా దవాఖానకు తరలించగా అప్పటికే ఆమె మరణించిందని డాక్టర్లు నిర్ధారించారు. నారాయణ పేట జిల్లా ఉట్కూరు మండలం పెద్ద జట్రాం గ్రామానికి చెందిన సాయమ్మ నగరంలోని కుమారుడు మల్లేష్ ఇంటి వద్దకు వచ్చింది. తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలకు గురై మరణించింది. కుమారుడు మల్లేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారంకు కృషి చేస్తా

## –ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

## –పలు సంఘాలకు ప్రొసీడింగ్ కాపీలు అందజేత



రాజన్న సిరిసిల్ల, మార్చి 5:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని పలు కుల సంఘ భవనాలకు, టీయుడబ్ల్యూజె (ఐజెయు), మహిళా సంఘ భవనాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్బంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తన గెలుపులో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచేందుకు జర్నలిస్టుల చేసిన కృషి మరువలేనిదన్నారు.

తన మాటల్ని అక్షరాల రూపంలో ప్రజలకు చేరువేస్తూ, గెలుపులో తోడ్పటునదించినందించిన జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే కృషి చేస్తానన్నారు. గత పాలకులు ఎమ్మెల్యే పదవిని హోదాకు చిహ్నంగా ఉపయోగించారని, కానీ ప్రజా ఆశీర్వాదంతో వచ్చిన ఈ పదవిని ప్రజల అభ్యున్నతికి, నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా పనిచేస్తానన్నారు. గెలిచినా రోజే ఎమ్మెల్యే పదవిని వేములవాడ నియోజకవర్గ ప్రజలకు అంకితం చేశానని గుర్తు చేశారు. మిగులు బడ్జెట్ గా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని గత పాలకులు అప్పుల కుప్పగా మార్చారాని అన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఏ ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలకు ప్రత్యేక నిధులు కేటాయించలేదని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఎమ్మెల్యేకు 10 కోట్లు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన రెండు రోజుల్లోనే మహిళా తల్లులకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో ఆరోగ్య శ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచామన్నారు.

గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి తొలి సంతకం ఉచిత కరెంటు పైనే చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతులకు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా 200 వందల యూనిట్ల వరకు విద్యుత్ పై జీరో బిల్ ఇస్తున్నామని పేర్కొన్నారు. గతంలో 500 రూపాయలు ఉన్న సిలిండర్ ధరకే,నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అదే ధరకు ప్రజలకు అందిస్తున్న ఘనత కాంగ్రేన్ ప్రభుత్వానిదన్నారు. ఈ నెల 7వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# కరాటే ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుంది

## –ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

## –హంసిని స్కూల్ విద్యార్థులకు మెడల్స్ అందజేత




రాజన్న సిరిసిల్ల, మార్చి 5:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో ఆదివారం మహాలింగేశ్వర గార్డెన్లో ఓకినవ స్పోర్ట్స్ కరాటే అకాడమి ఆధ్వర్యంలో పట్టణంలోని హంసిని పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు కరాటే పోటీల్లో కటాస్ వివిధ విభాగాల్లో బంగారు, వెండి, కాంస్య పత కాలు సాధించారు. మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మెడల్స్, సర్టిఫికెట్ అందజేసే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. అమ్మాయిలు తమను తాము రక్షించుకోవడానికి కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే కరాటేకి ప్రొస్సహిస్తున్న తల్లితండ్రులను అభినందించారు. పిల్లలకి కరాటే శిక్షణ ఇప్పిస్తున్న స్కూల్ కరెస్పాండెంట్ సంతోష్ కు అలాగే విద్యార్థులు మెడల్స్ సాధించుటకు కృషిచేసిన కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నాన్ ను అభినందించారు. పిల్లలు మొబైల్ కి దూరంగా వుండాలని, సోషల్ మీడియాకి అడిక్ట్ కావద్దని సూచించారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కాలువ నిర్మాణాలను చేపట్టాం : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, మార్చి 5 :ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం బేగంపేట్ డివిజన్‌లోని పీజీరోడ్డులోని డిమ్మా పాన్ షాప్ నుంచి జవహర్‌నగర్ వరకు రూ. 32 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరితో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పీజీ రోడ్డులో దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వరదనీటి కాలువ నిర్మాణాలను చేపట్టామన్నారు. ఇవే కాక చక్కటి వైట్ సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, ప్రవీణ్, కిశోర్, సంజయ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానము
జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్
GVR CULTURAL FOUNDATION
CULTURE IS LOVE OF HUMANITY
అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
నవరత్న మహిళా పురస్కారాల ప్రదానోత్సవం
ముఖ్య అతిథి :
శ్రీ పి. విజయబాబు
అధ్యక్షులు,
ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం,
ఆంధ్ర ప్రదేశ్ భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ.
సభాధ్యక్షులు
లయన్ డా॥ చిల్లా రాజశేఖర్ రెడ్డి
పారిశ్రామికవేత్త
సభాప్రారంభం
శ్రీ జమలాపురం రాధాకృష్ణ
లఘుచిత్ర నిర్మాత
సంగీత కళాకారుల సత్కారం
డా॥ టి. విజయభాస్కరరెడ్డి
న్యాయవాది, ప్రొఫెషర్ (న్యాయశాస్త్రం)
పురస్కార స్వీకర్తల స్వాగత సత్కారం
శ్రీమతి రామరాజు లక్ష్మీశ్రీనివాస్
డా॥ సి. నారాయణరెడ్డి
స్వర్ణకంకణ స్వీకర్త, ప్రముఖ వీణా విద్వాంసురాలు, గుంటూరు
అతిథుల సత్కారం
డా॥ లయన్ ఎస్. రామచంద్ర రావు
చైర్మన్, ఎస్. ఆర్. ఆర్. చారిటబుల్ ఫౌండేషన్
గౌరవ అతిథి
డా॥ ఎల్. జయంతిరెడ్డి
చైర్మన్, జె.జె. హాస్పిటల్
జ్యోతి ప్రకాశనం
శ్రీమతి కె. విజయలక్ష్మి
పారిశ్రామికవేత్త
ఆత్మీయ అతిథి
డా॥ కె. వీరభోగ వసంతరాయులు
కళాపోషకులు
తేది : 11-03-2024, సోమవారం, సా॥ 5.30 గం॥లకు
శ్రీత్యాగరాయ గానసభ (ప్రధానమందిరం), చిక్కడపల్లి, హైదరాబాద్.
గుదిబండి వెంకటరెడ్డి
చైర్మన్ - 9849882783
లయన్ వి.వి.రాఘవ రెడ్డి
ప్రధాన కార్యదర్శి - 9866332738

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.